క్లుప్తంగా

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



చిన్నారులకు బిస్కెట్లు అందజేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆదిత్య వాకర్స్ వ్యవస్థాపకుడు, వాకర్స్ గవర్నర్ పోలుమహంతి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని శ్రీకాకుళం డచ్ బిల్డింగ్ ప్రాంగణంలో ఆదిత్య వాకర్స్ అధ్యక్షుడు బురిడి గౌరీశంకర్ మంగళవారం ప్రారంభించారు. కోచ్ శ్రీరామ్ రాజ్, మణిపాత్రుని నాగేశ్వరరావు పర్యవేక్షణలో నెలరోజులపాటు చిన్నారులకు ఆటపాటలు, పరుగులో ప్రతిరోజూ ఒక గంట ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. గణేష్ స్వామి ఆర్థికసహాయంతో ప్రతిరోజూ వాటర్ బాటిళ్లు, బిస్కట్లు, వారానికి ఒకరోజు ఉడకబెట్టిన కోడిగుడ్లు, రాగిజావ, మొలకెత్తిన శనగలు పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. శనివారం చిన్నారులకు అల్పాహారాన్ని ప్రముఖ ఫిజియోథెరపిస్టు బి.శ్రీనివాస్ పట్నాయక్ అందజేస్తారన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఉమామహేశ్వరరావు కోరారు. సెక్రటరి ఎస్.శాంతారావు, ట్రెజరర్ గణేష్ స్వామి, కో ఆర్డినేటర్ శ్రీనివాస్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెవిటమ్మ తల్లిపండగ



ఘటాలతో బయల్దేరిన భక్తులు

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి మెట్టక్కివలస, అక్కివలస తదితర గ్రామాల గ్రామ దేవత చెవిటమ్మతల్లి అమ్మవారి పండగలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. 11 ఏళ్ల తరువాత పండగలు నిర్వహించడంతో ప్రతి ఇంట్లోనూ ఘటాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉపాధి పనుల పరిశీలన



మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

గార: ఉపాధి పని ప్రదేశాలలో సమయపాలన పాటించడం వల్ల పూర్తిస్థాయి వేతనం పొందుతారని డ్వామా పీడీ జీవీ చిట్టి రాజు అన్నారు. వాడాడ పంచాయతీ రెడ్డిపేటలో చేపడుతున్న ఉపాధి పనులను మంగళవారం పరిశీలించారు. కనీసం ఆరు గంటల పాటు పనిచేయడం వల్ల రూ. 270 వేతనం పొందవచ్చన్నారు. వేసవి అలవెన్సుల కింద ప్రభుత్వం రూ.15లు వేతనం పెంచడం జరిగిందన్నారు. సిబ్బంది నిర్దేశించిన కొలతల మేరకు పనులు చేయాలన్నారు. ఏపీడీ శైలజ, ఏపీఓ సి.హెచ్.సంధ్యారాణి, సర్పంచ్ సుంకాన సురేష్, జేఈ నారంనాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



సత్యంను పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్ తదితరులు

రణస్థలం: వల్లభరావుపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గడి సత్యం అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మంగళవారం అతన్ని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైఎస్సార్‌సీపీ నాయకులు చిల్ల వెంకటరెడ్డి, గురాన చిరంజీవి, మహంతి సత్యానారాయణ, గడి రమణ, పిల్ల వెంకటరమణ, గణపతి, పాలూరి బుజ్జి ఉన్నారు.

విజయగణపతికి ప్రత్యేక అలంకరణ

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని నానుబాలవీధిలో గల విజయగణపతి ఆలయంలోని స్వామివారికి ఆలయ అర్చకులు పెంట శ్రీధర్ శర్మ, పెంట నగేష్‌శర్మ ఆధ్వర్యంలో మంగళవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత బారువ

సోంపేట: పల్లిగొల్లగండి పంచాయతీలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ మంగళవారంతో ముగిసింది. బారువకు చెందిన మైత్రీ జట్టు విజేతగా నిలవగా ద్వితీయ స్థానాన్ని పల్లిగొల్లగండి జట్టు సాధించింది. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ. 11 వేలు, ఐదు వేల రూపాయల నగదుతోపాటు మెమెంటోలను గ్రామ సర్పంచ్ నాగం భాస్కరరావు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యర్ర మాధవరావు, సానా రాజేష్ కన్నా, వనిమిన భాస్కరారవు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలి

- ఎమ్మెల్యే కిరణ్‌కుమార్
- ఇబ్రహింబాద్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రజా ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. ఇబ్రహింబాద్ గ్రామ సచివాలయ పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. రేషన్‌కార్డు వారీగా చేకూరిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లు అందజేశారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ అవుతున్నాయన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామన్నారు. గతంలో జన్మభూమి కమిటీలు తమకు నచ్చిన వారికి మాత్రమే పథకాలను ఇచ్చేవారని గుర్తుచేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కొత్తగా మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. సంక్షేమ పథకాలు అందనివారుంటే జగన్నకు చెబుతాం కార్యక్రమంలో 1902 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, ఎస్ఎంపురం పీఏసీఎస్ అధ్యక్షులు సనపల నారాయణరావు, ఎంపీడీవో కుమార్ పట్నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య, వెలుగు ఏపీఎం రామూర్తి, సర్పంచ్ సూర కృష్ణవేణి, ఎంపీటీసీ సభ్యుడు సూర వెంకటరమణ, నాయకులు, ప్రజాప్రజా ప్రతినిధులు సూర అప్పారావు, మాడుగుల మురళీధర్‌బాబా, నక్క కృష్ణమూర్తి, పూజారి తవిటినాయుడు, సీపాన ఎర్రన్నాయుడు, కిల్లి రాఘురాం, ముద్దాడ శంకరావు, బోర సాయిరాం పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'ను వీక్షించిన నాయకులు



లావేరు: ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఎచ్చెర్ల క్యాంపస్: జగనన్నకు బెబుతాం కార్యక్రమంలో ఎంపీపీ చిరంజీవి తదితరులు

లావేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి మంగళవారం ప్రారంభించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం లైవ్‌ను మండలంలోని పెదలింగాలవలస గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు టీవీలో వీక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టరు లుకలావు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ గొర్లె రామినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల నారాయణరావు, పతివాడు గురునాయుడు, పంచాయితీ కార్యదర్శి ఎం రమణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భరత్, వెల్ఫేర్ అసిస్టెంట్ కల్యాణి, వీపీఏ పద్మావతి, ఎంఎస్‌కే మాధురి పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి తదితరులు జగనన్నకు చెబుతాం లైవ్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పారదర్శకంగా పాలన చేస్తోందన్నారు. 1902 టోల్ ఫ్రీ నంబర్‌కు ప్రజలు సమస్యలు చొప్పుకోవాలని సూచించారు. ఎంపీడీవో కుమార్ పట్నాయక్, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్‌బాబా, జేసీఎస్ కన్వీనర్ శ్రీరాములు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



ఎచ్చెర్ల క్యాంపస్: నీతి కథల గురించి వివరిస్తున్న లైబ్రేరియన్ నీలమ్మ

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని ఎచ్చెర్ల గ్రంథాలయ అధికారిణి ఎం.నీలమ్మ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులతో నీతి కథలు చదివించారు. నీతి కథలు సారాంశం గ్రంహించాలని ఆమె సూచించాలి.

లావేరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో మురపాక, లావేరు గ్రామాల్లోని శాఖాగ్రంథాలయాల్లో స్పోకెన్ ఇంగ్లిషుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రిసోర్సుపర్సన్లు టి.బాలరాజు, జి.రామారావులు శిక్షణ ఇచ్చారు. ఇంగ్లిషులో రాయడం, చదవడం ఎలా చేయాలి, ఇంగ్లిషును ఎలా నేర్చుకోవాలి తదితర విషయాలు వివరించారు. ఇంగ్లిషు అంటే భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో సహాయకులు ఎ.గడ్డెయ్య, పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.



లావేరు: మురపాక గ్రంథాలయంలో ఇంగ్లీషుపై శిక్షణ ఇస్తున్న రిసోర్సు పర్సన్ బాలరాజు



ఎచ్చెర్ల: మాట్లాడుతున్న జయరాం

ఎచ్చెర్ల: పెద్ద బాలశిక్ష, శతకపద్యాలు, వేమన, సుమతి, కృష్ణ, దాశరధి వంటి శతకాలు విద్యా విధానానికి దోహదపడతాయని మిథిల విద్యాలయం కరస్పాండెంట్ ఎం.జయరాం అన్నారు. ధర్మవరం గ్రంథాలయంలో శతక పద్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తి ప్రవర్తన నిధానంగా ఉండి.. పరిస్థితులు అర్థం చేసుకుని సుఖసంతోషాలతో ఆనందంగా జీవించడం ఏలాగో శతకముల ద్వారా విద్యార్థి దశనుంచే బోధన జరిగేదన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎం.చంద్రశేఖరరావు, సహాయకులు బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.



రణస్థలం: స్పోకెన్ ఇంగ్లీష్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు భాస్కరరావు

రణస్థలం: పుస్తక పఠనంతో సంపూర్ణ జ్ఞానం లభిస్తోందని రణస్థలం గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా రెండోరోజైన మంగళవారం దిన పత్రికలు, కథలు చదివించడం, రాయించడంతోపాటు స్పోకెన్ ఇంగ్లిషుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ధర్మారావు, ఇంగ్లిష్ టీచర్ కరిమజ్జి భాస్కరరావు, గ్రంథాలయ సిబ్బంది ఉన్నారు.

చిత్రలేఖనంపై శిక్షణ



చిన్నారులకు డ్రాయింగ్‌లో మెలకువలు చెబుతున్న ఎర్రమ్మ

శ్రీకాకుళం అర్బన్: చిన్నారులు బొమ్మలు వేసేటపుడు అందులో మెళకువలు తెలుసుకోవాలని ప్రభుత్వ ఉపాధ్యాయురాలు టి.ఎర్రమ్మ అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు రెండో రోజైన మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు ప్రతీ చిన్న విషయాన్ని ఆసక్తిగా, ఉత్సాహంగా గమనించాలన్నారు. అనంతరం పిల్లలతో డ్రాయింగ్ వేయించి, నీతి కథలు బోధించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఎస్.వి రమణమూర్తి మాట్లాడుతు వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ప్రతీరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవర్చుకోని, విజ్ఞాన్ని పెంపొందించుకోవాలన్నారు.

లలితా అమ్మవారికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని మెుండేటివీధిలో గల లలితా అమ్మవారికి ఆలయ అర్చకులు మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ముత్రాటలతో చల్లదనం చేశారు. సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంకాలం పుష్పార్చన, సహస్ర, అష్టోత్తర దీపారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి



పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతున్న ఉపాధ్యాయులు

జి.సిగడాం: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ కోరారు. కొత్తపెంట గ్రామంలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి పిల్లలను సర్కార్ బడుల్లో చేర్పించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచు పున్నాన సానియా, ఎంపీటీసీ సభ్యురాలు మక్క శ్రీలత, వైఎస్సార్‌సీపీ నాయకులు పున్నాన అక్కలనాయుడు, మక్క శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

కంచిలి: మఠం సరియాపల్లి గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ నెల పది నుంచి 24వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో పేమెంట్ చేసి, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 11వ తేదీ ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మెరిట్ ఆధారంగా.. రోస్టర్ ప్రకారం వంద సీట్లను భర్తీ చేస్తామని చెప్పారు. జూన్ 16వ తేదీన మెరిట్ లిస్ట్ ప్రకటిస్తామని, 18వ తేదీన ఎంపికైన వారి జాబితా వెల్లడిస్తామన్నారు. 19వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలనతోపాటు కౌన్సెలింగ్ ప్రక్రియ చేపడతామన్నారు. జూన్ 21వ తేదీ నుంచి తరగతులు మొదలవుతాయన్నారు. అదనపు సమాచారం కోసం 08947-294094, 99859 75684, 83744 33269 నంబర్లను సంప్రదించాలన్నారు.

సోంపేట: సోంపేట పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తు కాపీలను పాఠశాల కార్యాలయంలో అందజేయాలన్నారు. జూన్ 11న పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్ష రుసుం బీసీ, ఓసీలు రూ. 150 ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 75 చెల్లించాలన్నారు.

మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభం



మొక్కజొన్నలను తరలించే లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న నాయకులు

లావేరు: మొక్కజొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు అన్నారు. గురుగుబిల్లి గ్రామంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన మొక్కజొన్న పంటను లారీలతో గోదాంలకు మంగళవారం తరలించారు. కొనుగోలు ప్రక్రియను మండల ప్రజాప్రతినిధులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కజొన్న పంటను పండించిన రైతుల నుంచి ప్రభుత్వం క్వింటా 1962 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తోందన్నారు. రైతులకు సంచులను కూడా ప్రభుత్వం సమకూర్చుతోందన్నారు. రైతులకు సకాలంలో డబ్బులను కూడా చెల్లిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, గురుగుబిల్లి మాజీ సర్పంచ్ బాడిత రాంబాబు, అగ్రికల్చర్ అసిస్టెంట్ టి.లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి సాయికిశోర్ కిరణ్ దేవ్, రైతులు పాల్గొన్నారు.

సీతంవలసలో వైద్య శిబిరం



సీతంవలసలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రణస్థలం: జె.ఆర్.పురం పంచాయతీ పరిధి సీతంవలస, గొల్లపేట గ్రామాల్లో సర్పంచ్ బవిరి రమణ సారథ్యంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ చొరవతో ప్రత్యేక వైద్య శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఇటీవల ఓ యువకుడు కిడ్నీ సంబంధిత వ్యాధితో చనిపోవడం బాధకరమన్నారు. అటువంటి సమస్య మరెవరికీ రాకుండా ముందుజాగ్రత్తగా వైద్య శిబిరం ఏర్పాటు చేయించామని చెప్పారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు సుమారు ఐదు వందల మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, పంచాయతీ కార్యదర్శి అదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.సాయిరాం, దన్నాన సీతారాం, పిన్నింటి సత్యంనాయుడు, టేకి బ్రహ్మజీ, ముద్దాడ రాజశేఖర్ ఉన్నారు.

రైతుల సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న వేణుగోపాలరావు

జి.సిగడాం: గ్రామాల్లో నెలకున్న భూ సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి వెంటనే పరిష్కరిస్తున్నామని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ సర్వే రైతులకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ఇప్పటికే సర్వేపూర్తి చేసిన గ్రామాల్లో హద్దు రాళ్లు ఏర్పాటు చేశామన్నారు. కొన్ని గ్రామాల్లో కోర్టులో కేసులు ఉండటంతో సమస్యల పరిష్కారం సాధ్యం కాలేదన్నారు. సమస్య వచ్చిన వెంటనే సంబంధిత వీఆర్వో, ఆర్ఐల ద్వారా పూర్తి సమాచారం తెప్పించుకుని పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో డీటీ నాయకుడుగారి నిర్మల, హనుమంతురావు, ఆర్ఐ రామచంద్రరావు ఉన్నారు.

చందనగిరికి రహదారి సౌకర్యం కల్పిస్తాం

- సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



గిరిజనులతో మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

మెళియాపుట్టి: మండలంలో సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి మంగళవారం పర్యటించారు. ఎత్తైన చందనగిరి గిరిజన గ్రామాన్ని సందర్శించారు. గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారి సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. రూ.1.75 లక్షలతో ఆర్వోప్లాంట్ నిర్మించి శుద్ధజలాన్ని అందిస్తామన్నారు. సెల్‌టవర్ మంజూరైందని, పనులు వేగవంతం చేస్తామన్నారు. హడ్డివాడ రహదారి నిర్మిస్తామన్నారు. మండలకేంద్రంలోని ఏకలవ్య పాఠశాల పనులను పరిశీలించారు. జూన్‌లో వినియోగానికి తీసుకురావాలన్నారు. ప్రస్తుతం మెళియాపుట్టి మండలానికి సంబంధించిన ఏకలవ్య పాఠశాల పాతపట్నంలో నిర్వహించడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆమె దృష్టిలోకి తీసుకెళ్లారు. మండల కేంద్రంలో ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయం పాడుబడిందని, దాన్ని కూల్చివేసి ఆ ప్రదేశంలో పెట్రోల్ బంక్ నిర్మాణం చేపట్టాలని గిరిజన ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి శాంతారావు కోరారు. ఈ విషయంపై కలెక్టర్‌తో మాట్లాడుతామని పీఓ అన్నారు. ఈఈ మురళి, డీఈఈ శ్రీకాంత్, తహసీల్దార్ సరోజిని, ఎంపీడీఓ చంద్రకుమారి, ఎంఈఓ దేవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఔదార్యం..



చంద్రరావు భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు

కొత్తూరు: మండల కేంద్రానికి చెందిన రుగడ సత్యం పక్షవాతంతో బాధపడుతున్నారు. భార్య సూరీడు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ నిరుపేద కుటుంబానికి మంగళారం మండలంలోని కుంటిభద్ర గ్రామానికి చెందిన భగత్‌సింగ్ ట్రస్టు సభ్యులు వెళ్లి రూ.15వేలు అందజేశారు. అలాగే మండలంలోని నేతాజీ నగర్ కాలనీకి చెందిన సున్నాయిలు చంద్రరావు రెండు నెలల క్రితం మృతి చెందాడు. ముగ్గురు పిల్లలతో కుటుంబాన్ని భారంగా నడుపుతున్న మృతుడి భార్యకు రూ.15 వేలు అందజేశారు. ట్రస్టు సభ్యులు లోకేష్, జగది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామదేవత ఉత్సవం



ఘటాలతో బయలుదేరిన మహిళలు

గార: మండలంలోని శాలిహుండం పంచాయతీ తంగుళ్లపేట గ్రామదేవత ఉత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఇంటికొక ఘటం చొప్పున ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి మొక్కలు తీర్చుకున్నారు. ఊరేగింపులో ఎచెర్ల మండలం ధర్మవరం గ్రామానికి చెందిన చిన్నారుల కోలాటం అందరినీ అలరించింది. అమ్మవారికి జలాభిషేకం, చీరెలు, పండ్లు సమర్పించుకున్నారు.



ధర్మవరం చిన్నారుల కోలాటం